ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



**( జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 23-9-97 )**

**ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,**

ఇతరులకు సుఖమును, శాంతిని ఇవ్వాలిగాని దుఃఖమును ఇవ్వకూడదు. ఇతరులకు సుఖము, శాంతి, ఆనందమును ఇవ్వటం వలన మనకు చైతన్య స్థాయి పెరుగుతుంది. మన మనస్సులో అనేక రకములైన వికారములు ఉంటాయి. వికారమునకు ఆకారము కావాలి. అందుచేత పునర్జన్మ వస్తుంది. మనం మనస్సుకే పరిమితమై ఉన్నంతకాలం ఏదోరకమైన బాధ వస్తూనే ఉంటుంది. మనస్సు, దేహము గాఢ నిద్రలో అణుగుతాయి. నిజంగా నీవు మనస్సువు అయితే, దేహానివి అయితే అవి నిన్ను గాఢ నిద్రలో కూడా విడిచిపెట్టవు. అవినిజం కాదు కాబట్టి గాఢనిద్రలో అవి నిన్ను విడిచిపెట్టేస్తున్నాయి. మనదేహం ఎక్కడ ఉందో మనం అక్కడ ఉండము మనమనస్సు ఎక్కడుందో మనం అక్కడుంటాము భగవాన్ చెబుతూ ఉండేవారు, అరుణాచలంలో దేహాన్ని పెట్టుకుని బయట విషయాలను స్మరించటం కంటే దేహాన్ని అక్కడే ఉంచుకుని మనస్సుతో అరుణాచలాన్ని స్మరిఇంచటంమంచిది. దేహం ఎక్కడ ఉంది అనేది ప్రధానంకాదు. మనస్సు ఏదైతే ఆలోచిస్తోందో అదే మనం అవుతాము. దేహం యొక్క ప్రారబ్దమును బట్టి ఒకోసారి అనుకూల పరిస్థితులు, ఒకోసారి ప్రతికూల పరిస్థితులు వస్తాయి. దేహాన్ని ప్రారబ్దమునకు విడిచిపెట్టి నీ మనస్సును సంస్కరించుకొని, నియమించుకొని ఏదో ఒక మార్గాన్ని అవలంభించి మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచటమే అన్నియోగముల యొక్క సారము. హృదయం ఎక్కడ ఉంది అంటే నేను కూర్చొన్న కుర్చికంటే నేను ధరించిన శరీరంకంటే నాకు అతిదగ్గరగా ఉంది. అది తెలియకపోవటం వలన దూరంగా ఉంది అని మనకు అనిపిస్తోంది.

మనదేహానికి, ఇంద్రియాలకు, మనస్సుకు, బుద్ధికి అతీతంగా ఒక సద్వస్తువు ఉంది అనే ధృడవిశ్వాసం మనకు ఉండాలి. మీకు శాంతి సుఖం కావాలంటే మాటలను మనస్సులో కలపండి, మనస్సును బుద్ధిలో కలపండి,, బుద్ధిని చైతన్యంలో ఐక్యం చేయండి. పూజ, జపం, ధ్యానం వలన మనస్సు అణుగుతుంది. అది మరల విజృంభించే అవకాశము ఉంది. నేను అనే మూలతలంపు ఉంటే మనస్సు ఉన్నట్లే. దానిని ఆధారంగా చేసుకొని ఒక జన్మను బట్టి కొన్ని వేల జన్మలు రావచ్చును. ఎప్పుడు మీరు ప్రమాదంలో పడతారో చెప్పలేము. నీవు ధ్యానం చేస్తూ ఉంటే, సత్పురుషులతో సహవాసం చేస్తూఉంటే, సత్కర్మచేస్తూ ఉంటే మూలతలంపు అణగటానికి, నాశనం అవ్వటానికి ఇవి అన్నీ సహకరిస్తాయి ఏదో పూజచేస్తున్నాము, జపంచేస్తున్నాము అని సరిపెట్టు కొంటే ఈ మూలతలంపు పోదు నీవు ఎన్ని అవకాశములు ఉంటే అన్ని అవకాశములను ఉపయోగించుకొని మూలతలంపును పోగొట్టుకోవటానికి ప్రయత్నంచేయాలి.

అన్ని యోగములు మనిషికి అవసరమే. అన్ని యోగములను సమన్వయం చేసుకో, సమన్వయం

చేసుకోలేకపోతున్నాను అని సాధన మానవద్దు. యోగం అభ్యసించేటప్పుడు మనం ఒకోసారి సఫలం అవ్వలేకపోయినా అభ్యాసం చేయగా చేయగా సమన్వయం కుదురుతుంది. అభ్యాసంచేయగా చేయగా ఈశ్వరానుగ్రహం వలన అది ఫలిస్తుంది. మనలను అనుగ్రహించేవాడు ఎక్కడో దూరానలేడుమన హృదయంలోనే ఉన్నాడు. మనం ఏమార్గంలో ప్రయాణంచేసిన అహంభావన విజృంభించకుండా చూసుకోవాలి. దైనందిన జీవితంలో మన వ్యవహారములలో ఎక్కడా వ్యక్తిభావన విజృంభించకుండా చూసుకొంటే మన అందరికి జ్ఞానం కలుగుతుంది. వ్యక్తిభావన తగ్గేకొలది అపవిత్రత తగ్గుతుంది. సుఖంవాడికి తెలుస్తుంది పాయసం తిన్నప్పుడు, జున్ను తిన్నప్పుడుకూడా మనకు సుఖం వస్తోంది. కాని ఈ సుఖాలు పరిణామంలో దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. ఈ సుఖాలకు అతీతంగా స్వతంత్రమైన సుఖం ఒకటిఉంది. అది బ్రహ్మసుఖం. సమదృష్టి ఉన్న వాడికి బ్రహ్మసుఖం అందుతుంది. ఎవడైతే సమదృష్టిని విడిచి పెట్టకుండా పనిచేస్తున్నాడో అలా కొన్ని జన్మలు చేయగా చేయగా వాడు పవిత్రుడు అవుతాడు. పవిత్రుడు అయిన వాడికి బ్రహ్మసుఖం తెలుస్తుంది. బ్రహ్మసుఖం అనుభవంలోనికి వస్తేనేగాని వస్తువు యొక్క స్వరూపం మనకు తెలియనే తెలియదు. బ్రహ్మసుఖం అనుభవంలోనికి వస్తూఉంటే మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది. బాహ్యవిషయాలకు మనస్సు ఆకర్షించబడదు. ఆ సుఖంయొక్క స్రవంతిలో ఐక్యమయినపుడు నీకు పునర్జన్మలతో పనిలేదు.

నీవు ఉన్నావు అన్న సంగతి నీకు తెలుస్తోంది. ఉండటమే చైతన్యము, ఆత్మ. నీదేహానికి చావుఉందిగాని ఉండటానికి చావులేదు. జ్ఞానికి దేహముఉన్నా, లేకపోయినా, లోకముఉన్నాలేకపోయినా, దృశ్యము కనిపించినా కనిపించకపోయినా ఒక్కటే. అదిజ్ఞాని యొక్కవైభవము జ్ఞానికి పనిఏమీలేదు. ఆదేహాన్ని ఈశ్వరుడు స్వాదీనం చేసుకుంటాడు. ఆదేహంద్వారా ఏదైనా పనిజరగవలసిఉంటే ఆపనిని జరిపిస్తాడు. అంతే గాని ఆపని నాద్వారా జరగాలి అనే సంకల్పము అక్కడలేదు ఈశ్వరసంకల్పం, జ్ఞానిసంకల్పము వేరుగాఉండవు జ్ఞానిదేహము ద్వారా జరగవలసిన పని జరుగుతుంది. ఆయన పనిచేస్తున్నా చేయనివాడితో సమానము ఎందుచేతనంటే దేహగతమైన నేనుఅక్కడలేదు అదిఎప్పడో చనిపోయింది. ఈ శరీరం కాలిపోకముందే ఈశరీరంలోనే వాడికి పునర్జన్మ కలుగుతుంది, వాడుజ్ఞానిఅంటే, జీవలక్షణాలు పోతాయి, చైతన్యబుద్ధికలుగుతుంది చైతన్యానికి పరిమితులు లేవు, వాడుచైతన్యశ్రవంతిలో ఉంటాడు కాబట్టివాడికి పరిమితులులేవని తెలుస్తూఉంటుంది. మనముపనులు చేస్తాము. మనముచేసేనులే మనకు సంకెళ్ళు ఎందుచేతనంటే మనవాసనలను సంతృప్తిపరచటంకోసం మనం పనిచేస్తాం. మనకోరికలను నెరవేర్చుకోవటంకోసం పనిచేస్తున్నామా లేక ఈశ్వరుని ప్రీతికోసం పనిచేస్తునామాఅని మనస్సును వేతికిచూసుకుంటే మనముఎందుకుపనిచేస్తునామో మనకుతెలుస్తుంది.

24గంటలు దేహంగొడవలో ఉంటేనీకు శాంతిఏమిటి ?సుఖంఏమిటి ? మోక్షం ఏమిటి మొసలిని పట్టుకుని నదిని దాటుదామనుకోవటం ఎటువంటిదో దేహపోషణే ప్రధానంగా పెట్టుకుని మోక్షం పొందుదామనుకోవటం అటువంటిదే. మొసలి నిన్ను అవతలి గట్టుకు ఎలా తీసుకుని వెళ్ళదో అలాగె నీ దేహబుద్ది ఆత్మబుద్దిని కలుగజేయదు. ధ్యానమునకు విచారణకు తేడా ఏమిటి అని అడుగుతున్నారు.

ధ్యానంలో మూడు ఉంటాయి. ధ్యానం చేసేవాడు, చేయబడే వస్తువు, ధ్యానం చేయటం అనే క్రియ ఉంటాయి. విచారణలో మూడు ఉండవు. విచారణలో ఉన్నది ఒక్కటే నువ్వే. ఎదైతే నేను, నేను అంటోందో ఆనేనును శోధించటం, వాడిని తరుముకొని వాడి మూలంలోనికి నెట్టుకొని వెళ్లటం. విచారణలో వాడు ఒక్కడే ఉంటాడు. వాడిని మూలంలోనికి నెట్టుకొని వెళ్లటమే విచారణ. నిన్ను కంట్రోలు చేసేవాడు మనోమూలంలోనే ఉన్నాడు. ఒక ఆకారంగా లేడు చైతన్యంగా, ఆత్మగా ఉన్నాడు. మనస్సును నువ్వు ఎవరు అని ప్రశ్నిస్తూ దాని మూలంలోనికి పంపినపుడు మనస్సు వేరుతోసహ నశిస్తుంది. అప్పుడు మనోమూలంలో ఉన్న సత్యవస్తువే నీకు నేనుగా వ్యక్తమవుతుంది. మీకు కనీస అవసరాలకు లోటులేదు. అన్నీవున్నాయి. అయినా మీకు ఎందుకు దుఃఖం వస్తోంది ? మీరు ఉన్న స్థితి నిజమయితే మీకు శాంతి వస్తుంది గాని అశాంతిరాదు, ఆనందం వస్తుంది గాని దుఃఖంరాదు. ఇప్పుడు మీరు ఉన్న స్థితి నిజంకాదు. నువ్వు ఏదైతే అనుకొంటున్నావో అది నువ్వుకాదు. నేను ఏదైతే అనుకొంటున్నానో అది నేను కానప్పుడు మరి ఎవరిని నేను? అనేది ప్రశ్న. నీహృదయంలో ఏదైతే ఉందో అదే నువ్వు. ఇది నీకు నచ్చిన నచ్చకపోయినా నీకు ఇష్టం ఉన్నా లేకపోయినా నీహృదయంలో ఉన్నదే నువ్వు. మంచితనంమీద నీకు ఇష్టంలేకపోయినా మంచితనంమీద ఇష్టాన్ని కలుగజేసుకోవటంలోనే మనిషి తెలివి యొక్క ప్రాముఖ్యత ఉంటుంది.

మహాత్ములు చెప్పిన మాటలను వినటం శ్రవణం. వారి అనుభవాన్ని జోడించి చెపుతారు. శ్రవణం చేసిన విషయాన్ని మీ మనస్సులో జ్ఞాపకం పెట్టుకొనే ప్రయత్నం స్థిరంచేసుకొనే ప్రయత్నం మననం. మనస్సులో స్థిరపడిన దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటం నిధి ధ్యాస అని శాస్త్రము చెపుతోంది. ఏదైతే మననం చేస్తున్నావో అది నీఅనుభవానికి చిక్కాలి. ఆత్మభావన, ఆత్మధ్యాస నీహృదయంలో గాఢంగా పాతుకుపోవాలి. అప్పుడు సత్యవస్తువు నీకు తానుగా వ్యక్తమవుతుంది. ఎవడినైతే పోగొట్టుకోవాలో వాడిని నేను అని వాడిని పట్టుకొని తిరుగుతున్నావు. వాడిని విచారణ చేసి తొలగించుకోవటమే నీ జీవిత లక్ష్యం. నేను బాగా చదువుకొన్నాను, నావిద్య అంతా నాలోపలే జీర్ణం అయిపోయింది అన్నారు భర్తృహరి. అంటే బంధువులకు చెపుదామంటే అసూయ వస్తోంది. పదవులలో ఉన్నవారికి చెపుదామంటే 24 గంటలు గర్వంతో, మాకు అధికారంఉంది అని అహంకారంతో ఉంటే ఇంక వారికి నేను విద్యను ఏమిచెపుతాను. సామాన్యులకు చెపుదామంటే వారికి వినాలనే కాంక్ష ఉండదు. ఇంక ఎవరికి చెపుతాను. నావిద్యను నేనే మ్రింగేస్తున్నాను. నాలోపలే జీర్ణమయిపోతోంది అన్నారు.

మీకు ఇష్టమైన మార్గములో ప్రయాణం చేయండి అని చెపుతున్నారు. చివరకు విచారణమార్గమును పట్టుకొంటున్నారు. భక్తిపింది, జ్ఞానం పండు అంటున్నారు. మీరు చేసేటప్పడు మీరు జ్ఞానయోగి మీరు ఎక్కడ మొదలు పెట్టినా జ్ఞానమార్గంలోనికి తీసుకొని వెళ్తున్నారు. దానిలో ఉన్నప్రత్యేకత ఏమిటి అని ప్రశ్నిస్తున్నారు. ఆత్మవిచారణలోతప్ప మరి ఏఇతర సాధనా పద్ధతులలోనైనా సరే మనస్సు ఉపయోగించబడుతుంది. మనస్సు మంచిదికాదు. మనస్సు ఉంటేనే అశాంతి. పెంటమీద కూర్చొని చెడువాసన వస్తోంది అంటే కూర్చొన్న నీది తప్పగాని పెంటది తప్పకాదు. చెడువాసన అనేది

దాని స్వభావం. అలాగే మనస్సు చుట్టూ తిరుగుతూ శాంతి కావాలంటే ఎలా వస్తుంది. మనస్సు అంటేనే అశాంతి. ధ్యానం చేస్తున్నావు. ధ్యానం చేసేవాడు ఎవడు? మనస్సే. వదిలించుకోవలసింది మనస్సునే. వాడే దొంగ. వాడిని ముస్తాబు చేయవద్దు. మనస్సు నశిస్తే దృశ్యము నశిస్తుంది. దృశ్యం నశిస్తేగాని నీకు శాంతి కుదరదు. మనస్సును ఒక ప్రక్కకు గెంటేసి ఏదైతే సత్యవస్తువో, దేనినైతే నీవు తెలుసుకోవాలో దానిమీద గురిపెట్టు. మనస్సులో ఉన్న చెత్తనంతా నీవు పట్టించుకోకుండా ఏవస్తువునైతే పొందుదామనుకొంటున్నావో దానిమీద గురిపెట్టు. దానిని పొందటానికి ప్రయత్నం చెయ్యి. మనస్సు ఉన్నట్లుగా నీకు అనిపిస్తోంది కాబట్టి పూజ,జపం ధ్యానం చెయ్యమన్నారు విచారణ చేస్తే మనస్సు లేనేలేదు. అదిలేదని తెలిస్తే దేనితోనూనీకు పనిలేదు. ఎందుచేతనంటే అప్పడు ఉన్నది ఏదోనీకు నేరుగా వ్యక్తమవుతుంది. ఉన్నదేదోఉంది లేనిదేదోలేదు ఉన్నదానిని నీవు లేదులేదు అన్నా ఉన్నదిలేకుండాపోదు. లేనిదానినిఉంది, ఉందిఅన్నాలేనిది రాదు. ఉన్నదిపోదు లేనిదిరాదు.

కొంతమంది కొద్దిసేపు పూజలు చేస్తారు, జపాలుచేస్తారుధ్యానం చేస్తారు. తరువాత మనం పూజలు చేస్తున్నాము అసలు భగవంతుడు అనేవాడు ఉన్నాడా లేడా అని అనుమానం వస్తుంది. పూజలు,జపాలు చేసి ఇలా అనుమానం పెట్టుకునేవారికంటే పూజలు, జపాలు చేయక పోయినా భగవంతుడుఅనేవాడు ఒకడు ఉన్నాడు అనే దృఢమయిన విశ్వాసం ఉన్నవాడు ముందుబాగుపడతాడు మనస్సునునేను అని ఎంతకాలం అనుకొన్నా అదినువ్వు కాదు. దానిగొడవ వదిలి వెయ్యి. అసలు వస్తువు గురించి శ్రవణం చెయ్యి. శ్రవణం చెయ్యగా, చెయ్యగా దానిని పొందాలనే బుద్ధికలుగుతుంది. పూజ, జపం, ధ్యానం పేరుమీద నీమనస్సును ముస్తాబు చెయ్యవద్దు. మనస్సును ముస్తాబుచేస్తూఉంటే అది ఎలా పోతుంది. మన ఆధ్యాత్మికమార్గానికి అడ్డువచ్చేదిఅదే. నేను ఇన్ని గంటలు పూజచేస్తున్నాను ఇన్నిగంటలు జపం చేస్తున్నాను అంటారు ఇదొకరకమైన అహంకారము. అహంకారము రూపాలు మారుస్తుంది గాని దానిని నాశనం చేసుకోవటానికి అదిఇష్టపడదు.

ఆకాశానికి, మబ్బుకు ఎలా సంబంధములేదో హృదయంలో ఉన్న సద్వస్తువుకి శరీరానికి ఇసుమంతయు సంబంధము లేదు. హృదయస్థలంలో మనస్సును నిలబెట్టటంవలన మనస్సు నశిస్తుంది, మనస్సు కాలిబుడిద అవుతుంది. భౌతికమైన అగ్నివలన దేహం కాలిపోతుంది, జ్ఞానాగ్నివలన మనస్సు దహింపబడుతుంది. కొన్నిరోజులు అన్నం తినటం మానివేస్తే శరీరం నశిస్తుంది. శరీరం అన్నంలేకుండా ఉండలేదు. నామ, రూప చింతన మనస్సుకు ఆహారం. నీహృదయంలో మనస్సు ఉన్నప్పుడు నామచింతన, రూపచింతన ఆగిపోతుంది. ఎప్పుడైతే నామచింతన, రూపచింతన ఆగిపోయిందో మనస్సుకి ఆధారం లేక, దానికి ఆహారం అందక అదినశిస్తుంది. విషయం నీకు సరిగా అవగాహన అవుతూఉంటే ఇష్టంగా తేలికగా అభ్యాసం చేయగలవు. అవగాహన అవ్వకపోతే అభ్యాసం కష్టంగా ఉంటుంది. కష్టంగా ఎన్నాళ్ళు చేయగలవు. మనంచేసేది అనాత్మచింతన, పొందాలనుకొనేది ఆత్మని. అనాత్మను చింతిస్తూ ఆత్మను ఎలాపొందగలవు.

నేను అనే తలంపు ఉన్నప్పుడు నీవు ఉన్నావు, వాడు ఉన్నాడు. వాడు అంటే దేవుడు. నేను అనే తలంపులేకపోతే నువ్వు లేవు, వాడు లేడు. గాఢనిద్రలో మనస్సు వెళ్ళి హృదయంలో లయమవుతుంది.

అప్పుడు దేవునిగొడవలేదు, నీవు లేవు. మనస్సు ఉంటే నేను ఉంది, నీవు ఉన్నావు, వాడు ఉన్నాడు. మనస్సు అణిగిపోతే ఏమీలేదు. మిమ్మల్ని బాధపెట్టాలి అనిభగవాన్ ఉద్దేశంకాదు. చివరిస్థితికి మిమ్మల్ని తీసుకొని వెళ్ళటానికి చెపుతున్నారు. దేవుడు ఉన్నాడా, లేడా అని అనుమానిస్తున్నావు. అదికాదు నీమనస్సును అనుమానించు ప్రతీ మనిషికి నేను అనే బుద్ధి ఉంది. ఆనేను అనే బుద్ధి నీకు లోపల నుండి వస్తోంది. ఆనేను అనే బుద్ధి ఎక్కడనుండి వస్తోందో అక్కడే దేవుడు ఉన్నాడు. వాడు నిజమైన దేవుడు. గుడిలోదేవుడిని ఉపాసన కోసం పెట్టారు. హృదయంలో ఉన్న దేవుడిని తెలుసుకోవటానికి ఉపాసన అవసరం కాబట్టి గుడిలో దేవుని పెట్టారు. మీరు ప్రపంచమును విడిచిపెట్టి ఎక్కడికి పారిపోనక్కరలేదు. ఎక్కడకు వెళ్ళినా ప్రపంచము ఉంటుంది. చెడు అలవాట్లను, చెడ్డవాసనలను విడిచిపెట్టాలి. ఏవిషయములయితే ప్రపంచముతోటి, దేహంతోటి నిన్ను బంధిస్తున్నాయో వాటిని విడిచిపెట్టు నీకు మోక్షం వస్తుంది. నీవు సంసారంలోఉన్నా, సన్యాసములోఉన్నా, ఏదేశములో ఉన్నా నీవు పోగొట్టుకోవలసింది అహంభావననే. ఏగుణాలు నిన్ను దేహానికి, ప్రపంచానికి బంధిస్తున్నాయో వాటిని విడిచిపెట్టాలి. చనిపోయిన తరువాత దేహంకనబడదేమో అనుకొంటాము. అది దేహవాసన. చనిపోయిన తరువాత లోకం కనబడదేమో అనుకొంటాము అది లోకవాసన. దేహ వాసన, లోకవాసనలేదు అనుకో మరణం వచ్చినా నీకు భయంకలుగదు. ఎక్కడనుండి వచ్చావో అక్కడికి వెళ్ళిపో. వచ్చిన పనిచూసుకో. ఎక్కడికి వెళ్ళినా బాధలు ఉంటాయి. కొంతమంది ఏమిటి ఇటువంటి కుటుంబములో పడ్డాము అనుకొంటారు. ఇంకో కుటుంబంలోనికి వెళ్ళినా బాధలే ఉంటాయి. దేహప్రారబ్ధమునుబట్టి ఆకుటుంబంలోనికి వెళ్ళాము అనివారికి తెలియటంలేదు. అనుభవిస్తే ఆబాదలు పోతాయి. ఆకుటుంబంలో ఉంటేనే గాని కొన్నివాసనలు నశించవు అందువలన ఆకుటుంబములో పడవేస్తాడు. ప్రాణం పోయేటప్పుడు ఈజీవుడిని ఏకుటుంబంలో పెట్టాలో నిర్ణయిస్తాడు. వాడుకోరుకున్న కుటుంబం ఇవ్వడు. వాడివాసనలకు అనుగుణంగా ఉన్న కుటుంబంలో పడేస్తాడు. జ్ఞానం సంపాదించాలనే తపన బాగా ఉంటే యోగుల వంశంలో పడేస్తాడు.

మనకు కొంత పవిత్రత వచ్చింది అనుకోండి. ఒకజన్మకు సరిపడకారణాలు ఉండి జన్మ వచ్చింది అనుకోండి. ఆజన్మలో ఏదైనా దుష్టసహవాసం చేస్తే అది కొన్నివేల జన్మలను పెంచేస్తుంది. అందువలన బహుజాగ్రత్తగా ఉండాలి. సాధనబాగా చేయ్యాలంటే ఏకాంతవాసము, సహవాసము అవసరము. మహాత్ములతో సహవాసం వలన మనచైతన్యస్థాయి పెరుగుతుంది. ఏకాంతవాసము వలన మన మనస్సులో ఉన్నది ఏమిటో తెలుస్తుంది. మనం పోగొట్టుకోవలసినది ఏమిటో తెలుస్తుంది. కొంతమందికి ఏకాంతవాసం అంటే ఇష్టం ఉండదు. కానిచనిపోయిన తరువాత వాడు ఏకాంతముగా వెళ్ళాలని వాడికి తెలియటంలేదు. మనబంధువులు, స్నేహితులు స్మశానంవరకు వస్తారు. మనంచేసిన సాధన మాత్రం మనకూడ వస్తుంది. వేటగాడు అడవిలో ఉన్న జంతువులను ఏవిధంగా వేటాడతాడో అలాగ సాధకుడు ఈనేను అనే తలంపును వేటాడి దానిమూలం లోనికి గెంటాలి. దానిని వేటాడుతూఉంటే అది ఎక్కడనుండి ఉదయించివచ్చిందో అక్కడకు ఉపసంహరింపబడుతూ ఉంటుంది. మధ్యలో ఏదోరూపంలో విజృంభిస్తుంది, అవతారాలు మారుస్తుంది. అయినప్పటికి దానిని తరుముకొంటూ వెళ్ళాలి. దానిమూలంలో అది స్థిరపడేవరకూ నీవు జాగ్రత్తగా ఉండలి. మనం ఇన్ని

మాటలు చెప్పకొంటున్నాము. ఒక అవతారపురుషుని యొక్క అనుగ్రహం, ఒక జ్ఞానియొక్క అనుగ్రహం పొందితే కొన్ని క్షణాలలో వస్తువును పొందుతాము. అనుగ్రహంపొందిన వాడికి అసాధ్యం ఏమీ ఉండదు. రోడ్డును బిందిలతో నీళ్లు తెచ్చితడిపిన దానికి, వర్షంతో తడిసిన రోడ్డుకు ఎంత తేడా ఉంటుందో. మనసాధనకు, గురువు అనుగ్రహానికి అంత తేడా ఉంటుంది. సముద్రం ఎంతలోతుగా ఉంటుందో సంసారసముద్రంకూడా అంతలోతుగా ఉంటుంది. కాని జ్ఞానికి ఎంతదూరం వెళ్లినా మోకాలు లోతురాదు. అది జ్ఞానియొక్క వైభవం.

మిమ్మల్ని చూడటంవలన నాకు శాంతి కుదిరింది. కృతజ్ఞత తెలియపరచుకోవటం కోసం నేను వచ్చి మిమ్మల్ని చూసి వెళ్తున్నాను అని ఒకరు చెపుతున్నారు. కృతజ్ఞత అనేది జీవితంలో ముఖ్యం. మీకు ఎవరంటే ఇష్టం అనిఅడిగాను. వారు, వీరు అనిలేదు అందరూ నాకు ఇష్టమే అని చెప్పారు. అంటేమీకు ఇష్టంలేనివారు ఎవరూ లేరా అని అడిగాను. ఇష్టంలేనివారు ఉన్నారు అనిచెప్పారు. వారు ఎవరు అని అంటే నేనే అన్నారు. నేనంటే నాకు ఇష్టంలేదు. నాలో ఉన్న బలహీనతలు నాకు తెలుస్తున్నాయి. నాకు పవిత్రత రాలేదు. అందువలన నేనంటే నాకు ఇష్టం కలగటంలేదు అని చెప్పారు.

కొంతమంది మంచి చేయాలి అని మనస్సులో అనుకుంటూ ఉంటారు, మంచిచేయాలి అనినోటితో చెపుతూ ఉంటారు. మనస్సులో అనుకున్నంత మాత్రంచేత, నోటితో చెప్పినంత మాత్రంచేత, నీవు పవిత్రుడువు అవ్వవు. చేతితో మంచి చేయటంవలన నీవుపవిత్రుడువు అవుతావు. కొంతమందినోటితో చెపుతారు క్రియసున్నా. వారుపవిత్రులుకారు. నీవు మంచిచేయటం ద్వారా నెమ్మది, నెమ్మదిగా పవిత్రుడువు అవుతావు. రమణ మహర్షి కొన్నిక్షణాలకాలంలో మరణానుభవంద్వారా మహాజ్ఞాని అయిపోయడు. అలా నీవు అవ్వలేకపోయినా ప్రయత్నం చేసుకొని నెమ్మది, నెమ్మదిగా వాసనలను నాశనంచేసుకొని జ్ఞానమును సంపాదించుకో.

